# ఎదురీత

వేదుల మీనాక్షీదేవి



"జానకి పెళ్ళి చేసుకుందిట! వార్త క్షణాలమీద ప్రాకి, వూరంతా పట్నంలో కనబడింది!" అన్న గుప్పుమంది.

వింతగా చెప్పుకుంటున్నారు.

"ఇది నీలివార్త. అబద్ధం" అన్నారు కొందరు.

"కాదు. కళ్ళారా చూసినవాళ్ళు చెప్పారు. నమ్మకపోవడం యెలాగ?" అన్నారు మరికొందరు.

"అయ్యో! తల్లికీ, తండ్రికీకూడా తెలియలేదు" అని బుగ్గలు నొక్కుకున్నారు కొందరు.

ఈ విధంగా ఒకనాటి ఉదయం జానకి వివాహం ఒక చర్చనీయాంశం అయిపోయింది.

జానకి నిజంగా పెళ్ళి చేసుకుందే అనుకుందాం. అందులో అంత ఆశ్చర్యం దేనికి? బుగ్గలు నొక్కుకోవలసినంత పనేమిటి?... ఎందరు పెళ్ళిచేసుకోవడంలేదు?.... ఆ పెళ్ళిళ్ళలో పెద్దలు చూసి చేసినవీ వున్నాయి... పెద్దల అంగీకారంతో జరిగినవీ వున్నాయి... స్వతంత్రంగా వధూవరు లుద్వాహమైనవీ వున్నాయి...

ఈ రోజుల్లో స్త్రీలు పురుషులతో సమానముగా విద్య నేర్చుకుంటున్నారు. అన్ని రంగాలలోను పురుషులతో సమానముగా కృషి చేస్తున్నారు... బాధ్యతాయుతమైన పదవులను నిర్వహిస్తున్నారు. ఇటువంటి కాలంలో తమ జీవిత భాగస్వామిని ఎన్నుకోడంలో జానకి స్వతంత్రిస్తే తప్పేముంది? విద్యావతి, యుక్తాయుక్త విచక్షణజ్ఞానం కల జానకిని గురించి అంత ఆదుర్దా, ఆశ్చర్యం పడ్డం దేనికి ప్రజలు? అన్నది ఒకపెద్ద క్వశ్చన్ మార్కైంది।

* * *

రోజూ గాంధీనగరం పార్కువైపు షికారు వెడుతూంటారు యిద్దరు పెద్ద మనుష్యులు.

ఇద్దరూ మిత్రులు... ఇద్దరూ రిటైరయినవారు.

"నమస్కారమండీ" అంది ఒక అమ్మాయి ఒకనాడు వారినిచూసి.

పదేళ్ళుంటాయి. చిదిమి దీపం పెట్టవచ్చునన్న మనవాళ్ళ మాట జ్ఞప్తికి వస్తుంది ఆ అమ్మాయిని చూస్తే... తెల్లని పరికిణీ... తెల్లజాకట్టు... చెవులకు జూకాలు ... చేతులకు గాజు గాజులు ... రెండుజడలు వేసుకుంది.

మర్నాడు అదే సమయానికి, అదే చోట కనబడింది ఆ అమ్మాయి .. షికారు వెడుతున్న ఇద్దరు మిత్రులకూ నమస్కరించింది...

ఆ అమ్మాయి ఎవరో వాళ్ళిద్దరికీ తెలియదు. ఆమె అక్కగాని, అన్నగాని తమదగ్గర చదువుకున్నారేమో అనుకున్నారు వారు.

మూడవనాడు అదేవిధంగా ఆ అమ్మాయి అదేచోట నిలిచి నమస్కరించడంతో ఆ మిత్రులిద్దరికీ కుతూహలం కలిగింది.

"ఎవరస్మాయివమ్మా నువ్వు?

మమ్మల్నెలాగ యెరుగుదువు?" ఇత్యాది ప్రశ్నలు వేశారు.

"మా నాన్నగారు నారాయణరావుగారండి. ఆయన కాంపుక్లార్క్‌గా పని చేస్తున్నారండి... నేను అయిదో క్లాసు ప్యాసయానండి. ఆ స్కూల్లో అంత వరకే వుందండి... హైస్కూల్లో 1వ ఫారంలో చేర్పించడానికి అప్లికేషన్ పంపారండి నాన్నగారు... కాని, నాకు సీటురాలేదు... స్కూళ్ళు తెరిచారు... నాన్న కాంపులో వున్నారండి... నాకేమీ తోచక బాధపడుతుండగా నాలుగురోజుల క్రితం హెడ్‌మేష్టారు మీతో కలిసి యిల్లా వెళ్ళడం చూశాను... ఆయన మీకు స్నేహితులై వుంటారు. నా సంగతి మీతో చెబుదామని మీ కోసం రోజూ యిక్కడ వుంటున్నాను. మీరెలాగైనా హెడ్‌మేష్టారుతో చెప్పి నాకు సీటు యిప్పించండి. నాకు చదువుకోవాలని సరదాగావుంది'' అంది ఆఅమ్మాయి.

మేష్టర్లని హేళనచెయ్యడం, అల్లర్లను రెచ్చగొట్టడం, స్ట్రైకులుతప్ప చదువులు అక్కర్లేని విద్యార్థులుగల ఈ రోజులలో చదువుకోసం ఆ బాలిక ఆరాటం, ఉపాయం, ఆ మాట్లాడే తీరు, తెలివి చూసి వారికి ముచ్చట వేసింది.

"కనుక్కుంటామమ్మా" అన్నారు వారు.

మర్నాడు అదే సమయానికి వారి కోసం వేచివుంది ఆ బాలిక.

"ఏమన్నారండి?" అంది ఆత్రతగా.

"రేపు స్కూలుకివెళ్ళి హెడ్‌మేష్టారికి కనబడు" అని సలహా యిచ్చారు.

ఆ మరుసటిదినం షికారులో ఆ అమ్మాయి కనబడి నవ్వుతూ నమస్కరించింది.... "మీరు చెప్పినట్లే వెళ్ళానండి. సీటు యిచ్చారు హెడ్‌మేష్టారు. ఇదంతా మీ దయండి" అంది.

ఆ బాలికగొంతు రుద్ధమైంది.

చూడబోతే పదేళ్ళపిల్ల! ఆ ఆలోచన, ఆ మాట్లాడే నైపుణ్యం, ఆ వినయంతో ఎంతటివాళ్ళూ సంపాదించలేని సీటును సంపాదించింది.

ఆ మిత్రులిద్దరేకాదు. ఆ విషయాన్ని విన్నవారెవరూ ఆశ్చర్యపడకుండా వుండలేరు!

ఆ అమ్మాయే జానకి!

జానకి నారాయణరావుగారి కడగొట్టు సంతానం.

"సంతోషిగా దేని శత్రుడైన నశించు" అని పోతనార్యుని సూక్తి. తమకి వున్నంతలో తృప్తిగా బ్రతకడం ప్రతీవారూ నేర్చుకోవాలి... అందులోనే వుంది సుఖం... అందులోనేవుంది ఆనందం... అందులోనేవుంది మన శాంతి... అసంతృప్తితో బ్రతికేవారికి అడుగడుగునా అవాంతరాలే... బాధలే. ఇబ్బందులే..."

అందువల్ల తనకున్నంతలో తృప్తిగా బ్రతకాలనే తత్వాన్ని జీర్ణించుకున్నవారు

నారాయణరావుగారు...ఓ అతిథి, అభ్యాగతి, చుట్టం, పక్కం ఎవరువచ్చినా ఎంతో అప్యాయతతో ఆదరిస్తారు వారిని.

ఆవూరు ఆఫీసులకు కేంద్రం. కాలేజీ వుంది. సినీమాహాలు లున్నాయి. అప్పుడప్పుడు సర్కసులుకూడా రావడంకద్దు. రైలుప్రయాణం చెయ్యాలంటే ఆచుట్టుపట్ల వూళ్ళజనం ఆవూరు వచ్చివెళ్లాలి. ఈ విధమైన పనులకు వచ్చే పరిచయస్తులంతా నారాయణరావుగారి ఆదరం పొందేవారు.

పెద్దన్నగారు చెప్పిన గృహస్థు లక్షణాలను సంతరించుకున్నవారు నారాయణరావుగారు.

ఒకరిని గురించి చెడ్డగా చెప్పడం ఆయన నోట వినడంగాని, వినుకోకగా చూడ్డంగాని యెవ్వరూ యెరుగరు...

మహాసౌమ్యుడు!

అనుకూలవతి, భర్త మనసులో వర్తించి, అన్నపూర్ణకు నుద్దియైన అతని గృహిణి సహకారం ఎప్పుడూ ఆయనకు లభించేది.

అటువంటివారి సంతానం మాత్రం మరొకలాగ ఎలా వుంటుంది?... ముమ్మూర్తులా వారిని పోలినవారే వారి పిల్లలు!

ముగ్గురు కుమారులూ, ఒక కుమార్తె.

ఆ అమ్మాయే జానకి!

* * *

ఆ విధంగా స్వయంకృషితో హైస్కూల్లో 1వ ఫారంలో ప్రవేశించిన జానకి ఎంతో చురుకుగా అన్ని క్లాసులూ పాసైంది. మంచి మార్కులు వచ్చేవి. తన చదువేమో, తన గొడవేమో, రెండవ ధ్యాసేలేదు.

"నాయనా, పిల్ల పెళ్ళి చెయ్యవా? ఎన్నిమాట్లు చెప్పినా నా మాట చెవిని పెట్టవు కదా. ఈ యేడు చేస్తావా? చెయ్యవా?" అని కూర్చుం దొకనాడు నారాయణరావుగారి తల్లి.

"తగిన సంబంధంవస్తే చెయ్యనా అమ్మా" అన్నారాయన.

"మనం తిరగనిదే దానంతట అది వస్తుందేమిటి సంబంధం? నువ్వు పెళ్ళి కనుక్కున్నదేదీ?" అని సతాయించింది తల్లి.

"కనుక్కుంటానమ్మా. ఎక్కడా సెలవు దొరకడంలేదు. నెల్లాళ్ళు సెలవు తీసుకుని ఆ పని చూస్తాలేమ్మా, అయినా ఈరోజుల్లో చిన్నపిల్లలకు పెళ్ళిళ్ళు చేస్తున్నారా చెప్పు" అన్నారాయన.

"ఈ విధంగా పన్నెండేళ్ళు జానకికి వచ్చినప్పటినుండి చెబుతున్నాను. చిన్నపిల్ల, చిన్నపిల్ల అంటావు. ఇప్పుడు పదిహేనవయేడు వచ్చింది...నీకు తెలియదు నాయనా! ఎదిగిన ఆడపిల్ల గురించి అభాండాలు వెయ్యడానికి లోకం జంకదు సుమా! నేనూ పెద్దదాన్నై అయిపోయాను. ఎప్పుడో కన్నుమూస్తాను. ఈ లోగా జానకి పెళ్ళి చూడ్దామని వుంది




నాయనా" అంటూ తన తుదికోరిక వెలిబుచ్చింది నారాయణరావుగారి మాతృమూర్తి.

"అలాగేనమ్మా" అన్నారాయన.

ఈ సంభాషణ జరిగిన వారంరోజుల్లో ముసలమ్మగారి పెద్దతల్లి తాలూకు సంబంధంవారు రావడం, పెళ్ళిచూపుల తతంగం పూర్తవడం జరిగింది. ఇచ్చిపుచ్చుకోవడంవంటి వ్యవహారాలు మాట్లాడుకున్నారు.

ముహూర్తం పెట్టడమే తరువాయి.

మరొక వారంరోజులలో వారి కొక శుభలేఖ వచ్చింది. ఇటీవల తాము చూచిన సంబంధంవాళ్ళ శుభలేఖ అది!

ఆశ్చర్యపోయారు నారాయణరావుగారు, భార్య, ఆయన ముసలితల్లి.

జానకిని చూసుకుందుకు ముందుగానే ఒక సంబంధం చూసుకున్నారనీ, ఇక్కడ కూడా చూసి యెవరు యెక్కువ కట్నం యిస్తే ఆ సంబంధం కుదుర్చుకుందామనుకున్నారనీ. ఇక్కడ జానకిని చూసిన కబురు వారికి తెలిసి మరో వెయ్యి యెక్కువ యిస్తామని ఆశపెట్టారనీ కొన్నాళ్ళకు గాలివార్తగా తెలిసింది.

సంబంధం బెసిగిపోయినందుకు విచారించకపోగా ఆనందించారు నారాయణరావుగారు.

మాటకు విలువ యిచ్చి, కట్టుబడి వుండడం ఉత్తముల లక్షణం. అట్టి లక్షణాలు జీర్ణించుకున్న ఆయనకు చాలా కోపం వచ్చింది.

"ఇటువంటివాళ్ళ బారిపడకుండా భగ

వంతుడు నా బిడ్డను రక్షించాడు. నా పిల్ల అదృష్టవంతురాలు. ఇదీ మన మంచికే జరిగింది" అన్నారాయన.

తనవంకవాళ్ళు యిలాగ చెయ్యడం ముసలమ్మకు తలవంపు లనిపించింది.

"నా తల్లి కేంలోటని? అది వాళ్ళింట్లో మసిలే అదృష్టం వాళ్ళకి వుండవద్దూ? సిరిరా మోకాలు ఒడ్డారు. తెస్తారు యింత కన్న మంచిపిల్లని. ముందు ముందు మనకే తెలుస్తాయి అన్నిసంగతులూను .. నా తల్లికి కల్యాణంఘడియ వచ్చిందంటే ఆ వరుడు వాడే బైటపడతాడు."

ఉగ్రురాలై అంది నారాయణరావు గారి తల్లి.

జానకి ఎస్.ఎస్.ఎల్.సి. ప్యాసైంది. పి.యు.సి.లో చేరింది. ఉత్తమశ్రేణిలో వచ్చింది. బి. ఎ. లో కూడా ప్రథము రాలుగా ఉత్తీర్ణురాలైంది. అటు హైస్కూలులోను, కాలేజీలోనుకూడా చదువు లోనేకాదు, డిబేట్లలోను, వ్యాసరచన పోటీలలోను, వక్తృత్వ పోటీలలోను పాల్గొని ఎన్నెన్నో బహుమతులను పొందింది. తెలివైన, సత్ప్రవర్తనగల విద్యార్థినిగా ఉపాధ్యాయుల, అధ్యాపకుల మన్ననలకు పాత్రురాలైంది.

ఆమె వినయం, వివాదంబరత జానకి చదువుకు వన్నెతెచ్చాయి.

నారాయణరావుగారి ఆనందానికి అవధి లేకపోయింది. యం. ఎ. చదివించమని మిత్రులంతా సలహా యిచ్చారు.

ఇంతవరకు వున్న వూళ్ళో చదువు గనుక బాధలేకపోయింది. ఇప్పుడు యూనివర్సిటీకి పొరుగూరు పంపాలి... పంపడమా ... మానడమా ... హాస్టలు భోజనంతో ఆరోగ్యం పాడవుతుం దేమో?...ఇదీ ఆయన బెంగ.


ఎందరో అమ్మాయిలు చదువుకోడం లేదా? వుంటుంటే అదే సరిపోతుంది అని సర్దుకున్నారు.

యం. ఎ. లో సీటు వచ్చింది. కూడా వెళ్ళి చేర్పించి వచ్చారు జానకిని.

ఆమె కొద్దిరోజులలోనే ఆ పరిసరాలకు అలవాటుపడింది. యం. ఎ. సీనియర్ అమ్మాయి మణి...జానకి రూంమేటు... అలవాట్లు ... అభిప్రాయాలు యించు మించు ఆ యిద్దరివీ ఒకటే...ఏ విషయ మైనా ఒకరితో ఒకరు సంప్రతించుకునే వారు.

వయస్సులో మణి రెండుమూడేళ్ళు పెద్దది. అందువల్ల జానకిగురించి శ్రద్ధ తీసుకునేది.

ఆ సంవత్సరం అన్నలిద్దరికి సంబంధాలు కుదిరి వివాహాలు అయాయి... ఆ వివాహాలలో ఆడబిడ్డగా జానకి ప్రాముఖ్యం పొందింది ... పెళ్ళిళ్ళలో అటువారు, యిటువారు బంధువులు రావడం జరుగుతూండేదే. ఆ విధంగా ఆడపెళ్ళివాళ్ళ బంధువు లెందరో వచ్చారు. వారిలో యిద్దరు యువకులు నారాయణరావుగారి దృష్టి నాకర్షించారు.




వారిలో ఒకరు డాక్టరు, ఒకరు లెక్చరర్. ఇద్దరూ అవివాహితులే. ఇద్దరూ యించు మించు ఒక వయసువారే ... వారిద్దరిదీ జానకికి ఈడైన వయస్సే.

తాము పెద్దవారై పోతున్నారు. మగ పిల్లలిద్దరి వివాహం అయిపోయింది... మూడవ పిల్లవాడు ఢిల్లీలో చదువుతున్నాడు ... పెళ్ళి యింతట్లో వద్దన్నాడు ... ఒక్కగానొక్క కుమార్తె జానకి... ఒక్క సంవత్సరంలో యం.ఎ. అయిపోతుంది. ఈలోగా మంచి సంబంధం చూడాలి. ఆ ప్రయత్నంలో వుంటే చదువయే సమయానికి కుదురుతుంది...

తనూ, భార్యా బాగుండగా అమ్మాయి వివాహం అయిపోవాలి... బంగారు కంచానికైనా గోడ చేర్పుకావాలి... అందువల్ల తగిన వరునిచూసి జానకి వివాహం చేసెయ్యాలి.

ఇదీ నారాయణరావు దంపతుల ఆలోచన. జానకితో ఆ విషయం ప్రస్తావించారు. మీ యిష్టం అంది జానకి.

లెక్చరర్ సంబంధం చూసుకున్నారు. వరుడు కట్నం వద్దన్నాడు...అతని తల్లిదండ్రులూ అదే అన్నారు.

కట్నం లేకపోయినా గొప్పగా లాంఛనాలు జరిపి వివాహం వైభవంగా చేద్దామనుకున్నారు నారాయణరావు దంపతులు.

"కట్నంలేదు కనుక ఒక టేప్‌రికార్డర్ యివ్వండి. నా స్నేహితులెందరో వస్తారు. వారందరికీ మర్యాదచేసి, బట్టలు యివ్వాలి... స్కూటరు ఒకటి నాకు కావాలి..." ఈ విధంగా ఎన్నెన్నో

వ్రాశాడు వరుడుగా నిర్ణయించిన లెక్చరర్.

అడిగినవస్తువుల గురించికన్న అతని వుత్తరంవరస చాలా చికాకు కలిగించింది నారాయణరావుగారికి. పెళ్ళివారి ముచ్చట్లు తీర్చాలనే వారివుద్దేశం. వారు కోరనూవచ్చు. తాము ఈయనూవచ్చు. కాని, వరుని తల్లిదండ్రులుగాక అతడే కోరడం బాగాలేదు. పైగా, ఆ జాబు వ్రాసే పద్ధతిలో ఏమీ సౌజన్యం కనబడకపోగా ఆజ్ఞాపిస్తున్నట్లుగావుంది.

అతని స్వభావంగురించి మొట్టమొదటిసారిగా అనుమానం కలిగింది నారాయణరావుగారికి, ఇప్పుడే యీ విధంగా వ్రాసినవాడు పెళ్ళయాక ఎంత నిర్మొగమాటంగా వుంటాడో? పెడసరపు రకంలాగ కనబడుతున్నాడు...

అమ్మాయి మనస్సు అతి సున్నితమైనది. ఎన్నడూ యెవ్వరిమనస్సూ కష్టపెట్టేమాట అని యెరుగదు. ఇంత చదువుకున్నా తల్లీతండ్రీ దగ్గిర చిన్నపిల్లప్పుడు యెలావుందో అలాగే వుంటుందికదా!... అటువంటి బిడ్డ భవిష్యత్తు శాంతి సౌభాగ్య విలసితం అయేటట్టు చూసే బాధ్యత తనపై యెంతైనా వుంది... ఈ సంబంధంగురించి వాకబు చెయ్యాలి... తొందర పడరాదు... అనుకున్నాడు నారాయణరావుగారు.

మిత్రులద్వారా వాకబు చేయించారు వరుని గురించి.

ఆ వరుడు అనబడే లెక్చరర్ తల్లిదండ్రుల మాటలు వినడనీ, వారియందు ఏ విధమైన గౌరవం లేదనీ, ఒక్కగానొక్క కొడుకు అవడంవల్ల తనకి తోచినదంతా చేసే స్వభావంఅనీ, చిన్నప్పటినుండి గారాబం పెంపకంవల్ల అలా తయారయాడనీ తెలిసింది.

ఆ సంబంధం వదులుకుని, డాక్టరు సంబంధం నిశ్చయించుకున్నారు నారాయణరావుగారు.

జానకి యం.ఎ. ఆఖరి సంవత్సరం చదువుతోంది.

ఒకనాటి వుదయం నారాయణరావుగారికి ఎక్స్‌ప్రెస్ వుత్తరం వచ్చింది. ఆ కవరులో రెండేపంక్తులున్నాయి.

"మీ జానకి వివాహం చేసుకుంది పట్నంలో. నాలుగురోజులైంది... నా కళ్ళతో చూసిన విషయం యిది.

మీ శ్రేయోభిలాషి."

క్రింద సంతకంలేదు!

నిశ్చేష్టులయారా దంపతులు.

జానకివద్ద యెన్నిమార్లు వివాహ ప్రసక్తి తెచ్చినా "మీ యిష్టం నాన్నా. నా మంచి కోరేకదా మీరు ఏ పనిచేసినా. మీకన్న నాకు యెక్కువ లోకానుభవం వుందా చెప్పండి? మీలో నాకు విశ్వాసం వుంది" అంటుందే కాని తనేమీ స్వంతంగా ఆలోచించమన్నా ఆలోచించదే!...

జానకి వివాహం చేసుకుంటే తమకు



ఆనందమే. అయితే, తమకు తెలియకుండా చేసుకోవలసిన అవసరంలేదే... తాము ఆమె అభిప్రాయానికి విలువయిస్తారే ... తమకు ... తమపిల్లలకు మధ్య ఏమాత్రం అరమరికలు లేవే ... నిర్భయంగా, నిస్సంకోచంగా చెప్పవచ్చునే ...

ఆనాడు చిన్నతనంలో చదువుకోవాలన్న ఆకాంక్షతో తెలివిగా, సమయస్ఫూర్తిగా తనకుతానై స్కూల్లో సీటు సంపాదించుకుంది। ఈనాడు విద్యావతి... ఇంకా జ్ఞానంసంపాదించి...బుద్ధి సూక్ష్మతతో వ్యవహరించగలదు...ఫరవాలేదు. తొందరపడి ఏ నిర్ణయానికీ రానేరాదు... వచ్చిందీ అంటే బాగా ఆలోచించి మరీ నిర్ణయానికి వస్తుంది...

అనుకున్నారు తల్లీ, తండ్రీ.

* * *

"జానకి పెళ్ళి చేసుకుందిట. పట్నంలో యెవరికో కనబడిందట."

అన్నమాట క్షణంలో ఊరంతా గుప్పుమంది.

జానకి తల్లీ, తండ్రీ నిర్ఘాంత పోయారు.

తామెవ్వరితోనూ చెప్పలేదే?

అందరికీ యెలా తెలిసింది?

ఆశ్చర్య పోతున్నారు ..

ఆ వుత్తరం వచ్చిన సమయంలో పని మనిషి యిల్లు తుడుస్తూండడం, ఆవుత్తరం విషయం వారనుకోవడం దాని చెవినిపడ్డం వారు గమనించనేలేదు!

"పెదవి దాటితే పృథివి దాటుతుంది!"

"గోడలకు చెవులుంటాయి" అంటారిందుకే పెద్దలు.

"అమ్మాయి వుత్తరం వ్రాసి పది రోజులు కావస్తోంది. ఓ మారువెళ్ళి చూసి వస్తాను" అని విశాఖపట్నం వెళ్ళేబస్సులో బయలుదేరారు నారాయణరావుగారు.

ఆనాడు ఆదివారం...కాలేజీకి సెలవు.. నేరుగా హాస్టలుకే వెళ్ళారు నారాయణరావు గారు.

జానకి గదితలుపు తాళం వేసివుంది!

క్రిందటి సంవత్సరం రూంమేట్ మణి రిసెర్చి చేస్తోందా సంవత్సరం. జానకితో ఆ గదిలోనే వుంటోంది...ఆమె ఏదీ....

"జానకి యెక్కడికి వెళ్ళిందమ్మా" అని ప్రక్క గదిలోని విద్యార్థినులను అడిగా రాయన

"జానకి, మణి వూరికివెళ్ళి నాలుగు రోజులైందండి. రెండుమూడురోజులలో రావాలి. వారంరోజులు సెలవు తీసుకుని వెళ్ళారు ..ఎక్కడికి వెళ్ళారో మాకు తెలియదు" అన్నారు వాళ్ళు.

నారాయణరావుగారు ఆలోచనలో పడ్డారు.

తిరుగు ప్రయాణం అయారు.

మనస్సు చికాగ్గా, ఆందోళనగా వుంది.

జానకితో మణి యెందుకు వెళ్ళినట్లు?...తనకు తోడు రమ్మందా జానకి.. వివాహం సంగతి మణికి తెలుసునా?... లేక, మణే వివాహం చేసుకుంటే పొరబాటున జానకి అనుకున్నారా తనకు వుత్తరం వ్రాసినవాళ్ళు?...ఈ విధమైన ఆలోచనలతో ఆయన మస్తిష్కం వేడెక్కి పోయింది.

బరువుగా అడుగులు వేస్తూ వీధి మెట్లెక్కి తలుపుతట్టిన నారాయణరావు గారు నవ్వుతూ తలుపుతీసిన జానకిని చూసి తనకళ్ళని తాము నమ్మలేకపోయారు... ఆయనగొంతు రుద్ధమైంది... "ఎప్పుడు నువ్వు కంటపడతావా? అనుకుంటున్నాను తల్లీ. యెక్కడికి వెళ్ళావమ్మా" అని మాత్రం అనగలిగారు.

ఆయన నేత్రాలు శ్రావణ మేఘాలై వర్షించాయి.

"మణికి పట్నంలో లేడీస్ కాలేజీలో లెక్చరర్‌కి ఇంటర్వ్యూ వచ్చింది. నన్ను తోడుగా రమ్మంటే వెళ్ళాను. మణికూడా వచ్చింది మనింటికి. రేపు వెడతాం.




ఇక్కడికే ఎన్నో క్లాసులు పోయాయి" అంది జానకి.

దీర్ఘమైన నిట్టూర్పు విడిచి "ఈ వుత్తరం చూడమ్మా" అన్నారాయన.

"చదవక్కర్లేదు నాన్నా. అమ్మ చెప్పింది ... ఎంతటి అభాండం?... ఎంత కల్పన...ఇది యెవరై వుంటారో వూహించగలరా? ... మనం తిరస్కరించిన లెక్చరర్ రామారావు అయి వుండాలి ... తప్పదు...మాకు బెజవాడ ప్లాట్ఫారమ్మీద కనబడ్డాడు...తనకు ట్రాన్స్ఫర్ అయిందట. హైదరాబాదు వెళ్ళి కౌన్సిల్ చేయించుకుంటాడట... ఓ మంత్రిగారి సెక్రటరీ తనకు మిత్రుడట...ఎన్నెన్ని కోతలు!...ఎవరడిగారని?... మేము సమాధానమైనా చెప్పక పోయినా ఒకటే సోది...మనకి తన నిజస్వరూపం తెలిసిపోయిందని ఉడుకు మోతుతనంతో ఈపని చేసివుంటాడు... అంతకన్న మనమీద అయిష్టంవున్నవాళ్ళెవరూ లేరు నాన్నా" అంది జానకి.

ఆమెముఖం యెర్రబడింది రోషంతో.

"అంతే తల్లీ ... అంతే ... నువ్వు సరిగ్గానే వూహించావు ... 'అచ్చపు బుద్ధికి లేవగమ్యముల్' అన్నట్టు చిన్న దానివైనా చటుక్కున గ్రహించావు... ఎంత దుర్మార్గుడు!...అమాయకత్వంగా వెళ్ళి ఆతనిచేతిలో పడకుండా భగవంతుడు రక్షించాడు తల్లీ మనల్ని...తన సంబంధం కాదని, డాక్టరు సంబంధం కుదుర్చుకున్నామని ఈవిధమైన అగావులు వేస్తే ఆ సంబంధం చెడిపోతుందనీ తలపెట్టాడా తుచ్ఛుడు."

అంటున్న నారాయణరావుగారి కంఠం రుద్ధమైంది. "నాయనా, పిల్ల పెళ్ళి చెయ్యవూ? ఎదిగిన ఆడపిల్లలను గురించి అభాండాలు వెయ్యడానికి వెనుదియ్యదు మన సంఘం..." అని తన తల్లి అన్న మాటలు జ్ఞాపకం వచ్చాయి నారాయణరావుగారికి ... ఆ మాటలు చెవులలో

గింగురుమంటున్నాయి. విద్యావంతురాలు కాకపోయినా ... ఎంత లోకజ్ఞానంతో చెప్పింది! .... ఆమె ఆ మాటలు అని సుమారు పదిపన్నెండేళ్ళయింది ... ఆ నాటికీ ఈనాటికీ సంఘం పరిస్థితిలో మార్పేది?...ఆనాడు ఆమె అన్నమాట ఈనాడు అక్షరాలా నిజమయాయి!... "అందుకే పెద్దలమాట చద్దిమూట... పెద్దలవాక్కులు వేదవాక్కులు" అన్నారు.... అనుకున్నారు నారాయణరావుగారు.

"ఏమిటి నాన్నా...అదేపనిగా ఆలోచిస్తున్నారు" అంది జానకి.

"ఏమీ లేదమ్మా, ఎంత తెలివి తేటలున్నా, ఎంత సుగుణవతి అయినా, విద్యావతి అయినా, సంపాదించుకుని స్వతంత్రంగా బ్రతికే స్తోమతువున్నా, ఉన్నత పదవుల నధిష్టించినా ఈనాటికీ స్త్రీపట్ల సంఘం గౌరవం చూపలేకపోతోంది...బాహ్యమైన నాగరికతలో జాతియెంత పురోగమించినా మానసికంగా యిదివరకు కన్న పీసమెత్తు ప్రగతి సాధించలేదు స్త్రీ పట్ల సంఘం.

"ఎంత తెలివైనదైనా ఒంటరిగా బ్రతుకుతున్న స్త్రీ తన్ను తాను కాపాడుకుందుకు అడుగడుగునా ఈనాడు ఎన్నో క్లిష్ట పరిస్థితుల నెదుర్కోవలసి వస్తోంది. మానసికంగా నాగరికతలో వెనకబడుతూ, పీసమెత్తు ప్రగతి సాధించలేని కృత్రిమ, కుచ్ఛితమైన వాతావరణంలో ఈనాడు మనం వున్నాం.

"కాలవాహిని శరవేగాన ముందుకు సాగుతోంది. ఈ లెక్చరర్ వంటివారు ఆ వాహినికి యెదురీత యీదడానికి ప్రయత్నిస్తారు. ఆ యెదురీతలో ముందుకు పోలేరు. కొద్దిసేపట్లోనే అలిసిపోతారు. ఇటు ఎదురీతలో కృతకృత్యులు కాలేక, అటు కాలవాహినితో సాగలేక రెంటికి చెడిన రేవడలౌతారు. వీళ్ళు ఒకరు అభివృద్ధిలోవుంటే సహించలేని అసూయాపరులు.

"కాలం యిలాంటివారిని గుర్తించే అవకాశం మృగ్యం" అన్నారు నారాయణరావుగారు.

అంతవరకు వారి సంభాషణ వింటున్న నారాయణరావుగారి అర్ధాంగి

"పోనీలెండి. అయిందేదో అయింది. అమ్మాయి పరీక్షలు అన్నామని పెళ్ళివారు ముహూర్తానికి తొందర చెయ్యడంలేదు. నెల వున్నాయి పరీక్షలు. ఆ వెంటనే ముహూర్తం ఏర్పాటు చేయించి ఇప్పుడే వారికి కబురుచేయండి. ఆ శుభఘడియలుదాటితే ఇక అమ్మాయి ఎంత దూరం వున్నా మనకు బాధ, బెంగ వుండదు" అని చిన్నగా నవ్వుకుంటూ అంది.

ఆ మాటలకు సిగ్గుతో చెక్కిళ్ళలో గులాబీలు సంతరించుకున్న జానకిని చూసి ఆ తల్లిదండ్రులకళ్ళు ఆనందంతో మెరిశాయి.